



# మిత్రద్రోహి

యస్. రాజయ్యా

వరంగల్  నుండి హైదరాబాద్ వెళ్ళే కాకతీయ ఫాస్టు ప్యాసింజరు రైలు అది. ఆఫీసువాళ్ళకు; పాలవాళ్ళకు; కూరగాయలవాళ్ళకు సిటీకి వెళ్ళడానికి అనుకూలమైన బండి! బండి ఓ అయిదు నిముషాలు ముందు

నడుస్తోంది. ఆలేరు స్టేషనులో వచ్చి ఆగింది. హెడ్ క్వార్టర్ స్క్వాడ్; ఆర్.ఫి.ఎఫ్. వాళ్లు (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) మొత్తం రైలును చుట్టుముట్టారు. ఉదయాన్నే ఏ బండికి సికింద్రాబాద్ నుండి వచ్చారో; బండి ఆగగానే చుట్టుముట్టారు. కాకతీయ ఎక్స్ట్రా ఆగడానికి పదినిమిషాలు పర్మిషన్ కూడా తీసుకున్నారు. ఒక్కో పెట్టె దగ్గరా దిగేవాళ్ళను కదలనీయకుండా టికెట్ చెకింగ్ మొదలుపెట్టారు. ప్లాట్‌పారం ఆఫ్ సైడ్లో ఎవరు దిగకుండా ఆర్.పి.ఎఫ్ వాళ్ళు నిలబడి ఉన్నారు. శివరాంతో పాటు మెరికల్లాంటి కుర్రాళ్ళు ఇంకా స్క్వాడ్‌లో ఉన్నారు. వాళ్ళందరికి ఇన్‌చార్జి సారంగధర్.

'అమ్మా టికెట్ చూపించు' శివరాం అడిగాడు పెట్టెలోంచి దిగినావిడను. ముప్పయి అయిదేండ్లు ఉండవచ్చు. చేతిలో ఓ నోటుపుస్తకం, వానిటీ బ్యాగ్ ఉన్నాయి.

''లేదండీ, తీసుకోలేదు. నాది సీజన్ టికెట్టు, సీజన్ ఇంట్లో మరిచాను టికెట్ తీసుకుందామంటే బుకింగ్ దగ్గర హెవీ రష్!''

''ఔనండీ; బండి రావడానికి ఓ అరగంట ముందు టికెట్ తీసుకుని బండి ఎక్కాలి. లాస్ట్ మినిట్‌లో వచ్చి హెవీ రష్ అంటే కుదరదు. చార్జి కట్టక తప్పదమ్మా అన్నాడు మర్యాదగా.

''నేను ఇక్కడ టీచర్‌గా పని చేస్తున్నానండి, కాజీపేట నుండి రోజూ వస్తాను. నా సీజన్ టికెట్ ఈ రోజు తీసుకురాలేదు – సారీ సర్''

''సారీ లేదు, ఏమీలేదు డబ్బులు తియ్యండి రసీదు ఇస్తాను''

''నా దగ్గర డబ్బులు కూడా లేవండీ! ప్లీజ్ ఎక్స్‌క్యూజ్‌మి సార్''

ఆమెకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఏ దేవుడు రక్షిస్తాడా అన్నట్టు ఉంది ముఖం. ఇక లాభం లేదు. నోరు పెద్దది చెయ్యాలనుకుంది.

''ఎక్కడినుంచి వస్తారండీ మీరు? మేము రోజూ ఇదే బండికి వస్తాము మమ్మల్ని టికెట్టు ఎవరూ అడగరు. మీలాంటి కొత్తవాళ్ళు వచ్చినా సీజన్ అనగానే, వెళ్ళిపోతారు''

''చూడమ్మా! మాకు సమయం చాలా తక్కువగా ఉంది. టికెట్ చూపించు. లేదా పెనాల్టీ కట్టు. డబ్బులు లేవంటే. ఆర్.పి.ఎఫ్‌కు హాండోవర్ చేస్తాను''

''అయ్యో చెయ్యండి, భయపెట్టిస్తున్నారా? మాకూ పాసింజర్ అమెనిటీస్ కమిటీ ఉంది. మా సెక్రటరీ ఒక రిపోర్ట్ రాసాడంటే నీవు ఈ బండ్లో కాదు, రోడ్డు మీద తిరగాలి''

''సరే అమ్మా అట్లానే రోడ్డు మీద తిరుగుతా గానీ వెంకటస్వామీ ఈమెను కోర్టుకు తీసుకెళ్ళి బ్యాచ్‌లో కూర్చోబెట్టు. ఈమె దగ్గర టికెట్టు లేదు. డబ్బులు కూడా లేవంట''

''సరే సార్, నడువమ్మా పక్కకు, సికింద్రాబాద్ కోర్టుకు పోవాలె'' యథాలాపంగా మీసాలు దువ్వుకుంటూ అన్నాడు వెంకటస్వామి.

ఆమెకు ముచ్చెమటలు పోశాయి. వణుకు పుట్టింది. దబాయింపు సెక్షన్ కట్టిపెట్టింది.

''సికింద్రాబాద్ కోర్టుల ఏమిజేస్తరన్న మమ్మల్ని''

''కోర్టుల జడ్జి టికెట్ కొన్నావా లేదా, అని అడుగుతడు''


> ''సక్కంగ ఎనిమిది రోజులో, పదిరోజులో జైలుకు పొమ్మంటడు. ఆద పోలీసులు చెరో దిక్కు పట్టుకుని జేళ్ల ఏస్తరు. టికెట్ లేదంటే ఉట్టిగనే ఇడిసి పెట్టరు''


''లేదంట, పైసలు లేక కొనలేదంట. అప్పుడేం జేస్తడు?''

''జడ్జి జరిమానా కట్టమంటడు''

''టికెట్టు కొనడానికే డబ్బులు లేకపోతే జరిమాన ఎట్ల కడత? గామాత్రం అర్థం చేసుకుని ఇడిసిపెట్టడా?''

''సక్కంగ ఎనిమిది రోజులో, పదిరోజులో జైలుకు పొమ్మంటడు. ఆడ పోలీసులు చెరో దిక్కు పట్టుకుని జేళ్ల ఏస్తరు. టికెట్ లేదంటే ఉట్టిగనే ఇడిసి పెట్టరు'' మీసాల ముఖాన్ని భయంకరంగా పెట్టి అన్నాడు.

''ఒకనాడు టికెట్ తీసుకోకపోతే మనుషులను ఇంత తిప్పల బెడతారు. ఏ ఊరినుండి ఒస్తరో మా పానం తిననికె'' అంటూ టి.టి శివరాంకు డబ్బులు ఇచ్చి రసీదు తీసుకుని వెళ్లిపోయింది.

టికెట్లు తీసుకున్న ప్రయాణీకులు పరవాలేదు కాని, టికెట్లు లేని ప్రయాణీకులు వణికిపోతున్నారు. ఒక్కరిని కూడా వదలడం లేదు.

టికెట్లు లేకపోతే డబ్బులివ్వమంటున్నరు. ఆ డబ్బులే ఉంటే టిక్కెట్టు కొనుక్కోమా!'' టికెట్టు లేని వాళ్ళు వాపోతున్నారు.

''టికెట్టు అని అడిగితే, ఒక జూటసలాం కొడితే ఆయనే వెళ్ళిపోతడు'' అనే ఊహల్లో ఉన్నారు ఇంకొందరు.

పెట్టె మూడు తలుపులు క్లోజ్ చేశారు. ఒక తలుపు ఓపెన్ పెట్టి చెక్ చేస్తున్నారు. ఇక ఓ జంటిల్ మాన్, జంటిల్ ఉమెన్ ముగ్గురు పిల్లలతో ప్రయాణం చేస్తున్నారు. శివరాం డోర్లో ఎక్కగానే స్థలం లేక నిలబడి, వాళ్లే తారసపడ్డారు. పదిహేడేండ్ల, పద్నాలుగేండ్ల ఆడపిల్లలు, ఐదేండ్లు పైబడిన మగపిల్లవాడున్నాడు. వాళ్ళ టికెట్లు చెక్ చేసి, '' ఈ బాబు టికెట్ ఏదీ?'' అంటూ అడిగాడు.

''వాడికింకా అయిదేండ్లు నిండలేదండీ. అందువల్ల తీసుకోలేదు''

''హల్లో బాబూ, నీ పేరేమిటి? ఏమి చదువుతున్నావు నాన్నా!'' అంటూ శివరాం బుగ్గ పట్టుకున్నాడు మృదువుగా.

''మైనేమ్ ఈజ్ రాంబాబు. ఐ యామ్ గోయింగ్ టు ఫస్ట్ క్లాస్''

''చూశారా, బాలవాక్కు బ్రహ్మవాక్కు. డబ్బులు తియ్యండి. మీ అబ్బాయి వయసును దాచిపెట్టలేరు''

ఆ తండ్రి డబ్బులు ఇచ్చి రసీదు తీసుకున్నాడు మారు మాట్లాడకుండా. ఇంకా లావటరీ దగ్గిర బిక్షగాళ్లు, కూలినాలి చేసుకునేవాళ్ళు ఒదిగి నిలబడ్డారు.

''ఏయ్! మీ టికెట్లు చూపించండయ్యా''

''మేము బోనగిరిలో దిగిపోతము సార్, డబ్బుల్లేక తీసుకోలేదు సార్'' అంది ఒక బిచ్చగత్తె.

''బిచ్చం అడుక్కునేటోళ్లం! మాకు తిండికే లేదు. టికెట్టు ఎట్ల తీసుకోవాలె సార్, దయచేసి మమ్ములను ఇడిసేయండి''

''ఓలమ్మా, నాకు భయమేత్తోందయ్యో, నన్ను ఒగ్గేయండోయ్యోయ్. చచ్చి నీ కడుపున పుడతానయ్యో'' అందొక ముసలావిడ.

''సార్ మమ్మల్ని దిగనివ్వండి, మేము వెళ్లిపోతాము'' ఇంకొక అతను అన్నాడు.

''బండ్లో ఎక్కడం, టికెట్టు అడిగితే దిగిపోతాననడం, అది కుదరదు. ముందు టికెట్ చూపించండి, కాకపోతే డబ్బు చార్జి కట్టండి.

''అడుక్కు తినేటోళ్ళం, మా దగ్గర లేవు సార్''

''వెంకటస్వామీ! టికెట్టుకు డబ్బులు లేవంటున్నారు, వాళ్ళను చెక్ చెయ్'' ఆర్.పి.ఎఫ్, వెంకటస్వామికి చెప్పాడు

అందరి జేబులు, జోలెలు, సంచులు, కొంగుముళ్ళు చెక్ చేసి నూట అరవై రూపాయలు తీశాడు.

''ఇక ఆ డబ్బులు ఇటివ్వు'' అంటూ తీసుకుని ముగ్గురికి కలిపి రెండు రసీదులు రాసి వాళ్ళ చేతిలో పెట్టాడు.


''బిక్షం అడుక్కునేటోళ్లను కూడ వదలకపాయె. ఈయన కడుపు సల్లగుండ'' అంటూ అందరూ శాపనార్థాలు పెట్టారు.

అక్కణ్ణించి కోచ్ లోపలికి వెళ్లాడు.

మజ్దూర్ యూనియన్ కార్డులు, సంఘ్ కార్డులు షర్టు జేబులో పెట్టుకుని, ప్రదర్శిస్తున్న రైల్వే వర్కర్లు నమస్తే సార్, అంటూ లేచి నిలబడ్డారు.

''ఆ ఆ నమస్తే; నమస్తే మీదగ్గిర పాసులు ఉన్నాయా?''

''ఉన్నయి సార్, చూపించమంటారా?'' అన్నా




డొక వర్కర్.

''అక్కర్లేదు ఉండనీ'' అంటూ ముందుకు ''టిక్కెట్, టిక్కెట్'' అనుకుంటూ వెళ్లాడు.

అకస్మాత్తుగా, తాను హైస్కూలు, కాలేజీలో చదువుకునేటప్పటి మిత్రుడు కనిపించాడు. అతడి పేరు రంగారావు.

యథావిధిగా ''టికెట్, టికెట్ ప్లీజ్'' అన్నాడు.

''మిమ్మల్ని చూసి చాలా రోజులైంది సార్, బాగున్నారా?''

''ఎప్పుడు తనను ఓరే శివా! అని పిలిచేవాడు ఈ రోజు తనను సార్ అంటున్నాడంటే, వీడి దగ్గర టికెట్ లేకనే అతి మర్యాద చూపిస్తున్నాడనుకున్నాడు''

గుర్తు పట్టనట్లుగానే ''టికెట్టు ప్లీజ్'' అన్నాడు నోరు తెరచి చూడటం రంగారావు వంతయింది.

''మీ టికెట్ చూపించండి సార్'' మరోసారి అడిగాడు.

''చూపించమంటారా సార్,'' వచ్చీరాని నవ్వుతో అన్నాడు రంగారావు.

''మీరు బండ్లో ప్రయాణం చేస్తున్నారు. టికెట్ తీసుకుని ఉండాలి. అది చూపించండి సార్'' అన్నాడు.

''చూపించకుంటే ఏం జరుగుతుందంటారు?'' కోపంతో కటువుగా అన్నాడు రంగారావు.

''వెంకటస్వామీ చెప్పు ఏం జరుగుతుందో?''

''టికెట్ లేనివాళ్ళందర్నీ జమచేసి, గుంపుగా కోర్టుకు తీసుకుపోతాము సార్, అక్కడ జడ్జిగారు ఫైన్ వేస్తారు. ఆ ఫైన్ కూడ కట్టకపోతే జైలుకు పంపుతారు''

''అయితే టికెట్ లేకుండా ప్రయాణం చేస్తే జైలన్నమాట'' అనుకుంటూ రంగారావు గతంలోకి జారిపోయాడు. ఈ లోపల ఇతర ప్యాసింజర్ల దగ్గర టికెట్లు చెక్ చేస్తున్నాడు శివరాం.

శివరాం ఎలాంటి సహృదయుడు, ఎలా మారిపోయాడు! రంగారావు నాన్న శివరాం నాన్న రైల్వే వర్కర్స్. తను అతను రైల్వే స్కూల్లోనే చదివేవారు. కలిసి చదువుకునేవారు, కలిసి ఆడుకునేవాళ్ళు, హైస్కూలు అయిపోయింతర్వాత కాలేజీలో డిగ్రీ ఒకేసారి పూర్తి చేశారు. తాను స్టేట్ గవర్నమెంటు ఉద్యోగంలో చేరాడు. శివరాం వాళ్ళ నాన్న గుండెపోటుతో చనిపోగా, అతడికి కంపాషనేట్ గ్రౌండ్స్‌లో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. మొదట టికెట్ కలెక్టరుగా; రైల్వేస్టేషన్ గేట్‌లో పనిచేసేవాడు. ఆ తర్వాత ప్రమోషన్ వచ్చి ట్రైన్ టికెట్ ఎగ్జామినర్‌గా స్క్వాడ్‌లో పనిచేస్తున్నాడు. ఇంత ముఖం కూడా చూడకుండా మాట్లాడుతున్నాడు. తానెవరో తెలియనట్లుగా బిహేవ్ చేస్తున్నాడు. రాస్కెల్! ఏరా శివరాం, అనకుండా డ్యూటీలో ఉన్నాడని తనెంత రెస్పెక్ట్ ఇచ్చి మాట్లాడినా, వాడి అధికార దర్పం ప్రదర్శించుకుంటున్నాడు, తనను ఆర్.పి.యఫ్. రక్షక్‌కు పట్టించి కోర్టుకు తీసుకెళ్తాడా? అంత పనిచేస్తాడా శివరాం! రోజూ టిక్కెట్టు కొనుక్కునేవాణ్ణి, ఈ రోజే ట్రైన్ రైట్ టైమ్‌కు వదలడంతో కొనుక్కోలేదు. శివరాంను రిక్వెస్టు చేసినా, తను చిన్ననాటి స్నేహితుడని చెప్పినా వినకపోతే; ఆ సంగతి వాడిక్కూడా తెలియదా? రైల్లో ఉన్నానని నాటకాలాడుతున్నాడు...''

ప్రక్కనుండి శివరాం గొంతు వినిపిస్తోంది.

''ఔనండీ, ఎందుకు మీరు టికెట్ కొని బండి ఎక్కరు? రైలుబండి అంటే ఎవరూ అడగరని, టికెట్టు కొనరా? బస్సుల్లో అలాగే టిక్కెట్టు తీసుకోకుండా వెళుతున్నారా? లావటరీ సదుపాయాలతో, బస్సు కంటే తక్కువ ఫేర్‌తో రవాణాసౌకర్యం కలుగజేస్తుంటే టికెట్ లేకుండా ప్రయాణం చెయ్యడం షేమ్‌ఫుల్ అండీ''

''అబ్బ వీడే వచ్చాడండీ, దేశాన్ని ఉద్ధరించడానికి, పండ్లు పటపటలాడిస్తూ అనుకున్నాడు రంగారావు.

''మిమ్మల్ని బాధపెట్టి డబ్బుల్ని మా పాకెట్లో వేసుకోడానికి కాదు. నెల నెలా, మేము మంత్లీ కోటా కట్టాలి. ఇలా నిక్కచ్చిగా ఉంటేనే కోటా డబ్బులు వసూలు అవుతాయి''

ఎంత ధైర్యంగా ఉందామన్నా రంగారావుతో కావడం లేదు,.

శివరాంను తిట్టుకుంటూనే భయంభయంగా ఉన్నాడు.

''సార్, చెప్పండి, మీ సంగతేంటి?'' అంటూ రంగారావు దగ్గరకి వచ్చాడు శివరాం.

''ఇదిగో తీసుకోరా, మిత్రద్రోహి'' అనుకుంటూ కోపంగా డబ్బులిచ్చాడు.

రసీదు రాసి చేతిలో పెట్టి, ''టికెట్, టికెట్ ప్లీజ్'' అనుకుంటూ ముందుకు సాగిపోయాడు శివరాం.

★